క్లుప్తంగా

పాలమూరుకు రావాల్సిన జలాలపై ఉద్యమించాలి



మరికల్: పాలమూరు ఉమ్మడి జిల్లాకు రావాల్సిన జలాలపై ఇక్కడి ప్రజలు ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని పాలమూరు అధ్యయన వేదిక కార్యదర్శి సుదర్శన్, వెంకట్రాములు అన్నారు. ఉమ్మడి జిల్లాకు నీటి పరంగా జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు ఈ నెల 5న హైదరాబాద్‌లో జరగనున్న సభకు సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణ, తుంగభద్ర, భీమ, దుందుభి వంటి నదులు, వాగులు, వంకలు పాలమూరు జిల్లాలో ప్రవహిస్తున్నా తమకు సరైన వాట దక్కడం లేదన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే సభతో ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, ఆంజనేయులు, శ్రీను పాల్గొన్నారు.

జలాశయాల గణనపై శిక్షణ కార్యక్రమం

నారాయణపేట: జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో గురువారం 7వ చిన్న తరహా సాగు నీటి పథకాలు, జలాశయాల గణనపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య ప్రణాళిక అధికారి ఎస్.యోగనంద్ పర్యవేక్షణలో జిల్లా స్థాయి భూగర్భశాఖ అధికారులు, నీటిపారుదలశాఖ అధికారులు సిబ్బందికి రాష్ట్రంలో భూగర్భ–ఉపరితల సాగునీటి పథకాలు ఎన్ని ఉన్నాయో ఎలా లెక్కించాలో సిబ్బందికి అవగాహన కల్పించారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల అందజేత

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లులేని పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుండడంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని జిల్లా కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అప్పంపల్లి గ్రామంలో గురువారం డీఈ హరికృష్ణతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాకి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, కార్యదర్శి జ్యోతి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, దామోందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ అరోగ్యం

కోస్గి రూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకంగా జీవించవచ్చని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం పట్టణంలోని 12వ వార్డులో తడి–పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేసి చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. అలాగే వస్తువుల వినియోగానికి ప్లాస్టిక్ సంచులు వాడడాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌కుమార్ , హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, మాస్టర్ శ్రీనివాస్, రాంబాబు, మున్సిపల్ అదికారులు, మెప్మా సిబ్బంది , కార్మికులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మక్తల్: పట్టణంలో ఎంపీపీఎస్‌జీపీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈశ్వర్, వెన్నెల జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికై నట్లు పాఠశాల ఉపాధ్యాయురాలు దీప తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓ అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో అభినందించారు. విద్యార్థులకు జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, అశోక్, శ్రీ విద్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత

కోస్గి రూరల్: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక టిప్పర్, ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గుండుమాల్ వాగు నుంచి గొల్ల కృష్ణయ్య ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను నింపుకొని వెళ్తుండగా తనిఖీల్లో పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఏఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. అలాగే మద్దూర్ మండలానికి చెందిన డ్రైవర్ రామకృష్ణ టిప్పర్‌లో ఇసుక నింపుకొని వెళ్తుండగా కోస్గి పట్టణంలో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెరువు కట్టలపై నడిచేదెలా..?



మాగనూర్ ప్రధాన చెరువుపై ఏపుగా పెరిగిన ముళ్లకంపలు

- చెరువుల వద్ద జంగిల్ కటింగ్ చేపట్టని అధికారులు
- కట్టలపై కనుమరుగవుతున్న దారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మాగనూర్: చెరువు.. పల్లె ప్రజలకు ఆదరువు. అలాంటి చెరువులను రక్షించాల్సిన అధికారులు వాటిని పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో దాదాపు 48 చెరువులు, 15 కుంటలు ఉన్నాయి. ఇవన్నీ మండలంలోని అనేక గ్రామల ప్రజలకు తాగునీరుతో పాటు సాగునీరందిస్తున్నాయి. చెరువుల నిర్వహణలో భాగంగా రెండేళ్ల క్రితం ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలతో జంగిల్ కటింగ్ చేపట్టారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో చెరువు కట్టలపై ముళ్ల కంపలు, చెట్లు పెరిగిపోయాయి. దీంతో ఏపుగా పెరిగిన మొక్కలు, చెట్లతో చెరువులు కనిపించని పరిస్థితి నెలకొంది.

అధికారుల సమన్వయ లోపం..

చెరువుల నిర్వహణ నీటి పారుదలశాఖ చూస్తుంది. చెరువుల నిర్వహణకు ప్రభుత్వం ఆరు నెలల క్రితమే లష్కర్లను నియమించింది. అయితే తూతూ మంత్రంగా లష్కర్ల నియామకం చేపట్టడంతో మండలానికి ఒక లష్కర్‌ను కూడా నియమించలేదు. కేవలం సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మాత్రమే ముగ్గురు లష్కర్లను నియమించారు. వీరు చెరువుల నిర్వహణతో పాటు, కెనాల్స్, నీటి విడుదల వంటి అంశాలని పర్యవేక్షించాలి. లష్కర్లు లేని సమయంలో రెండేళ్ల క్రితం ఆయా గ్రామ పంచాయతీల తీర్మానాల మేరకు ఉపాధిహామీ కూలీలతో జంగిల్ కటింగ్ చేపట్టారు. ఇప్పుడు పెరిగిన చెట్ల కొమ్మల కటింగ్‌ను లష్కర్లు చేపట్టాలి. లేదా ఉపాధిహామీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. రెండు జరగకపోవడంతో తటాకాలపై జంగిల్ పెరిగిపోయింది.

పొంచి ఉన్న ప్రమాదం..

మాగనూర్, అమ్మపల్లి, వడ్వాట్, పర్మన్‌దొడ్డి, కొత్తపల్లి, వర్కూర్, మందిపల్లి, నేరడగం, నేరడగం దొడ్డి, బైరంపల్లి, గురువలింగంపల్లి తదితర గ్రామాల చెరువులపై జంగిల్ కటింగ్ చేపట్టాలి. భారీగా పెరిగిన చెట్లు, కొమ్మలతో దారులు మూసుకుపోయాయి. దీంతో రైతుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఉపాధిహామీ సిబ్బందితో జంగిల్ కటింగ్ చేపట్టినా వారు కేవలం దారిని మాత్రమే క్లియర్ చేస్తున్నారు. మాగనూర్ చెరువుపై నిత్యం మూడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పెరిగిన చెట్లతో దారి మూసుకుపోయి, ప్రమాదాలు జరుగుతున్నాయి. నీటి పారుదలశాల, ఉపాధిహామీ అధికారులు సమన్వయంతో పనిచేసి చెరువులను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



చెరువుల నిర్వహణకు ప్రభుత్వం ఏటా నిధులు కేటాయించాలి. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెరువులను కాపాడింది. కొత్త ప్రభుత్వం చెరువుల నిర్వహణకు నిధులు కేటాయించలేదు. నిధులు కేటాయించి గొలుసుకట్టు చెరువులను రక్షించాలి. నిధుల లేమితో ఇప్పటికే అమ్మపల్లి పెద్ద చెరువు రూపురేఖలు కోల్పోతుంది.

– నర్సింములు, అమ్మపల్లి గ్రామం

మరమ్మతు చేపట్టాలి



చెరువు కట్టలు ధ్వంసం కాకుండా చూడాలి. గతంలో ఉపాధిహామీ ద్వారా చెరువుల కట్టలు బాగు చేసుకున్నాం. గతేడాది సొంత నిధులతో మాగనూర్ గ్రామ పెద్ద చెరువు కట్టపై కంపచెట్లను తొలగించుకున్నాం. ప్రస్తుతం అధికారులు చెరువుల నిర్వహణకు లష్కర్లను నియమించారు. వారితో పనులు చేయించాల్సిన బాధ్యత పాలకులదే. రైతులకు ఇబ్బందులు లేకుండా మరమ్మతులు చేపట్టాలి.

– ఆంజనేయులు, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్

త్వరలోనే జంగిల్ కటింగ్ చేపడుతాం



గత ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ ద్వారా జంగిల్ కటింగ్ చేపట్టారు. ప్రస్తుతం చెరువు కట్టలపై ముళ్ల చెట్లు మొలవడం వాస్తవమే. సంబంధిత ఉపాధిహామీ అధికారులతో సమన్వయం చేసుకుంటే త్వరలోనే జంగిల్ కటింగ్ ద్వారా సమస్యను పరిష్కరిస్తాం.

– మహ్మద్ గౌస్, ఇరిగేషన్ ఎస్‌ఐ

చిరుత సంచారం.. భయాందోళనలో ప్రజలు



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రానికి సమీపంలో గల పేరపళ్ల గ్రామంలో చిరుత సంచరిస్తున్నట్లు పలువురు రైతులు అనుమానం వ్యక్తం చేయడంతో అక్కడి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏళ్ల నుంచి గ్రామ సమీపంలో షెడ్డు వేసుకుని పశువులను పెంచుకుంటున్నారు. ఈ ప్రాంతం ఏక్లాస్‌పురం, అవుదంబర్, ఫుట్పాక్ సజనాపురం, ఉడుములుగిద్ద అడవులకు దగ్గర ఉన్నందున చిరుత సంచరించినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పలువురి రైతుల పొలాల్లో పులి అడుగుజాడలు కనిపించాయని చెప్పడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న భారతీయ కిసాన్ సాంగ్ కమిటీ సభ్యులు అక్కడికి వెళ్లి రైతులతో మాట్లాడారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



నారాయణపేట టౌన్: ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి బట్ట సంచులను వినియోగించాలని పురపాలక సిబ్బంది తెలిపారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా నారాయణపేట పురపాలక సంఘం పరిధిలో గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడటం వలన కలిగే నష్టాలు వివరించి ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వ్యాపారస్తులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్, మెప్మా మహిళా సంఘాలు, వార్డు ఆఫీసర్లు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ఈఓను విధుల నుంచి తొలగించాలి

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన హుండిలోని నగదు లెక్కింపుపై తమకు ముందస్తు సమాచారం ఇవ్వాలని గ్రామ మాజీ సర్పంచ్ అంబ్రేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆలయంలోని హుండి లెక్కింపు చేపట్టగా గ్రామంలోని ఏ ఒక్కరికి సమాచారం ఇవ్వకుండా డబ్బులు తీసుకెళ్లడాన్ని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆలయానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలను ప్రజలకు తెలపకపోవడం ఏంటని ప్రశ్నించారు. జిల్లాలోనే అతి పెద్ద బ్రహ్మోత్సవాలలో గుడెబల్లూర్ ఆలయం ఒకటిగా పేరుగాంచిందని ఆలయ అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఈఓను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

బడి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు



పాఠశాల ఎదుట నిలిచిన నీటిని పరిశీలిస్తున్న నాయకులు

మరికల్: మండలంలోని పస్పుల పాఠశాల ఎదుట వర్షపు నీరు నిల్వ ఉండకుండా తక్షణమే ఎమ్మెల్యే నిధులతో ప్రహరీ నిర్మిస్తామని జిల్లా కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పాఠశాల ప్రాంగణం మొత్తం నీరు నిలిచి బురదమయంగా మారడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు సాక్షిలో కథనం ప్రచురించగా కాంగ్రెస్ నాయకులు గురువారం పాఠశాలను పరిశీలించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పాఠశాల ముందు నీళ్లు నిలువకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. రెండు రోజుల్లో ప్రహరీతో పాటు నీళ్లు వెల్లడానికి డ్రైయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హరీష్, రాజేందర్‌గౌడ్, చెన్నయ్య, రఘు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సూర్యమోహన్‌రెడ్డి

మరికల్: మంగలోని ఒంపుపై కల్వర్టు నిర్మాణం చేపట్టడంపై స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు నిర్మించాలని నాయీ బ్రాహ్మణులు ఇటీవల ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి విజ్ఞప్తి చేశారు. నాయీ బ్రాహ్మణుల శ్మశాన వాటికకు, అలాగే వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు మంగలోని ఒంపు అడ్డుగా ఉంది. ఒంపులో మనిషి లోతు వరకు నీరు నిలిచి ఉండడం వల్ల అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాలను నీటిలో మునుగుతూ తీసుకెళ్లాల్సి వస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి నిధులను కేటాయించి కల్వర్టు నిర్మించాలని అధికారులకు అదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గురువారం జిల్లా కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి కల్వర్టు పనులకు పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో హరీష్, రామకృష్ణారెడ్డి, వేణు, అశోక్, చెన్నయ్య, రఘు, గోపాల్, చంద్రశేఖర్, బీసన్న, శివకుమార్, వెంకట్రాములు, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలి



కొత్తపల్లిలో మూతపడిన వాటర్ ప్లాంట్

మాగనూర్: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఉన్న వాటర్‌ప్లాంట్ నిరుపయోగంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామస్తుల తాగు నీటి అవసరాల నిమిత్తం ముప్పై ఏళ్ల క్రితం గ్రామంలో ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం నిర్వాహణ లోపం కారణంగా ప్లాంట్ మూతపడింది. దీంతో గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాటర్‌ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్లు.. తప్పని పాట్లు



మండల కేంద్రంలోని రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బస్టాండ్ నుంచి గాంధీచౌక్, ఎన్టీఆర్ కాలనీ, కంచుకోట వెళ్లే సీసీ రోడ్డు మొత్తం దెబ్బతిని గుంతలమయంగా మారింది. 20 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు కావడం అలాగే ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోడ్డు మొత్తం ధ్వంసమైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ఈ రోడ్డుపై వెళ్లాలంటేనే జంకుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో కొద్దిపాటి వర్షానికే మండలంలోని రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయని అధికారులు స్పందించి తాత్కాలికంగా అయిన మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– ధన్వాడ

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కోస్గి: ప్రభుత్వం స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని పలు కళాశాలల విద్యార్థులతో కలిసి శివాజీ చౌరస్తా నుంచి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల బకాయి స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే కార్పొరేట్ విద్యా సంస్థల్లో విచ్చల విడిగా పెంచిన ఫీజులను నియంత్రించాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, మండల అధ్యక్షుడు గౌస్ , రాజు, కృష్ణ , అశోక్ తదితరులు ఉన్నారు.

ఫీజులను నియంత్రించాలి

మక్తల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం మక్తల్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి పేద విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు దాదాపు రూ.8వేల కోట్లు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



రోడ్డు విస్తరణకు మార్కింగ్ వేస్తున్న అధికారులు

మద్దూరు: పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం మీదుగా చింతల్‌దిన్నే వరకు రోడ్డు విస్తరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు కలిసి గురువారం రోడ్డు మార్కింగ్ వేశారు. పట్టణంలో వెళ్లే ఈ ప్రధాన రహదారి ఇరుకుగా మారడంతో 70 అడుగుల రోడ్డుగా మార్చడానికి మార్కింగ్ వేసినట్లు పుర కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ రోడ్డు డివైండర్, డ్రెయినేజీ, బటర్‌ఫ్లై లైట్లతో కలిసి నూతన రోడ్డును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అయితే రోడ్డు విస్తరణకు మార్కింగ్ వేయడానికి వచ్చిన అధికారులతో ఇళ్లు కోల్పోతున్న బాధితులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమకు జరిగే నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సందీప్ , పుర సిబ్బంది పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



డీకే అరుణకు వినతిపత్రం అందిస్తున్న వైద్యులు

నారాయణపేట రూరల్: సుప్రీంకోర్టు మార్గ దర్శకాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వైద్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు జిల్లా పల్లె దవాఖాన డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్లుగా డాక్టర్లుగా పని చేస్తున్న తమకు చాలా తక్కువ వేతనం చెల్లిస్తున్నారని వాపోయారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా అమలు చేయించాలని, మహిళా ఉద్యోగులకు 120 రోజుల ప్రసూతి సెలవులు వర్తింప చేయాలని కోరారు. ప్రతి సబ్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆకస్మిక మరణం పొందిన వైద్యుల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే బండగొండ గ్రామంలో యాదవ, ఎస్సీ కమ్యూనిటీ హాల్, హైమాస్ట్ లైట్స్, సీసీ రోడ్డు, డ్రెయినేజీ ఏర్పాటుకు నిధులు విడుదల చేయాలని స్థానిక బీజేపీ నాయకులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు.

‘పగోడైనా సరే మనోడినే గెలిపించుకుందాం’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున బరిలో నిలిస్తే పగోడైనా సరే పంతాలను పక్కన పెట్టి మనోడినే గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గడిమున్కన్‌పల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా ముందుకెళ్తే విజయం మనదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ప్రజలు విసిగిపోయారని సంక్షేమ పథకాలను ఎన్నికల సమయంలో మాత్రమే అందిస్తూ ప్రజలకు మభ్యపెడుతున్నారన్నారు. కార్యకర్తలు స్థానిక సమరానికి అన్ని విధాలుగా సిద్ధం కావాలని తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సప్ప, వెంకట్‌రెడ్డి, బీమయ్యగౌడ్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

చలో సచివాలయాన్ని విజయవంతం చేద్దాం

మాగనూర్: ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్‌ను అమలుచేసి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు బాల్‌రాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ కోసం ఈనెల 4న తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చి తీరా అధికారంలోకి రాగానే విస్మరించి యువతను మోసం చేస్తుందన్నారు. వెంటనే అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

నారాయణపేట రూరల్: కాంగ్రెస్ నాయకులు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెపూర్ రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు అవుతున్న చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి నియోజకవర్గంలో కానీ నారాయణపేట మండలంలో కానీ ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన పనులనే కొత్తగా శిలాఫలకాలు వేసి ప్రారంభిస్తున్నారని ఎద్దేవా చేశారు. కోటకొండ మండల ఏర్పాటు హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మొక్కు చెల్లించుకున్న మంత్రి వీరాభిమాని

మాగనూర్: తన అభిమాన నాయకుడు వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వస్తే మాగనూర్ శ్రీ లక్ష్మినర్సింహ స్వామికి 101 టెంకాయలను మొక్కుగా చెల్లిస్తానని కాంగ్రెస్ పార్టీ మక్తల్ యువజన అధ్యక్షుడు వేణుగౌడ్ గతంలో స్వామిని కోరుకున్నారు. ఈ క్రమంలో వాకిటి శ్రీహరి ఇటీవల మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో వేణుగౌడ్ గురువారం ఆలయంలో మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి సతీమణి లలిత హాజరు కాగా ఆలయ సభ్యులు ఆమెను శాలువాతో సన్మానించారు.

భూ తగాదా.. ఇరువర్గాల ఘర్షణ

మాగనూర్: మండలంలోని కోల్పూర్ గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు ఎస్‌ఐ అశోక్ బాబు తెలిపారు. గ్రామానికి చెందిన కుండ తాయమ్మ కుమారుడు బీమేష్, కోడలు మల్లికతో అదే గ్రామానికి చెందిన నాగప్ప అతడి కుమారులు తిమ్మప్ప, శంకరప్ప, అల్లుడు తిమ్మప్పలు భూమి విషయంలో గొడవ పడి మరణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుండ తాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు కాంగ్రెస్ సమ్మేళనం

నర్వ: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించనున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సభకు కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ ఒక ప్రకటనలో కోరారు. సభకు ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని ఆయా విభాగాల అధ్యక్షులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.